క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరగనున్నట్టు మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, అందరూ హాజరవ్వాలని తెలిపారు.

నేడు ఏఎస్ఆర్ కాలనీలో గడప గడపకు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ రామ్‌నగర్ సచివాలయం పరిధి ఏఎస్ఆర్ కాలనీలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

రాంబిల్లి : రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను రాయితీపై అందజేస్తున్నామని ఏవో సి.సుమంత తెలిపారు. రైతులు ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో నేలకు సారం లభిస్తుందని, రసాయన ఎరువుల ఖర్చు తప్పుతుందన్నారు.

బెలూన్స్‌తో విన్యాసాలు



బెలూన్స్‌తో స్వాగతం పలుకుతున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు బెలూన్స్‌తో చేసే వివిధ రకాల ఆకారాలపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా అచ్యుత స్కూల్ టీచర్ నర్సింగరావు విద్యార్థులకు బెలూన్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా మేధోశక్తి పెరగడంతో పాటు, అనేక కొత్త ఆలోచనలకు దారి తీస్తుందన్నారు. ముందుగా విద్యార్థులు బెలూన్స్ చేత బట్టి స్వాగతం పలికారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

430 మందికి ఉచిత కంటి పరీక్షలు



బ్రాండెక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 430 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా 107వ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించింది. 322 మందికి కళ్లద్దాలు, 70 మందికి మందులు పంపిణీ చేశారు. 46 మందికి కాటరాక్ట్ సర్జరీలు అవసరమని వైద్యులు సూచించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన ఏర్పాట్లు చేశారు. శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరిశీలించారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన

రాంబిల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని దిమిలి లైబ్రేరియన్ శకుంతల అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం యోగాపై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్స్ శానాపతి అప్పారావు, గల్లా నూకినాయుడు భక్తి గీతాలు, భజన పాటలను విద్యార్థులకు నేర్పించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భజనలు చేయాలని అప్పారావు సూచించారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి



రెడ్ ఛాలెంజ్ సింబల్ చూపుతున్న మహిళలు



మహిళా ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- మెప్మా ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య అవగాహన సదస్సు

యలమంచిలి : రుతుక్రమం సమయంలో మహిళలు అపోహలు వీడనాడి ఆరోగ్య సూత్రాలు విధిగా పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. ఆదివారం ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత రోజును పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో యలమంచిలి మెప్మా కార్యాలయంలో మహిళలకు ఉచిత ఆరోగ్య సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ మహిళలు రుతుక్రమం సమయంలో ఉండే ఇబ్బందులు సమస్యలు ఎవరికీ చెప్పలేకపోతున్నారని, ఈ నిశ్శబ్దాన్ని మహిళలు ఛేదించేందుకు ఏటా మే 28వ తేదీన అంతర్జాతీయ రుతుక్రమం దినోత్సవం ద్వారా మహిళల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి వారిలో ప్రేరణ కల్పించడం జరుగుతోందని అన్నారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సమస్యలపై మహిళలు ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు సలహాలు పాటించాలని, ఏఎన్ఎంల పర్యవేక్షణ తీసుకోవాలని డ్వాక్రా మహిళలకు సూచించారు. ఈ సందర్భంగా రెడ్ ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెచ్‌బి టెస్ట్‌లు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, డాక్టర్ గౌతమి, మెప్మా సిఎంఎం పద్మావతి, మెప్మా సిబ్బంది రమాదేవి, సత్య, కృష్ణవేణి, డ్వాక్రా మహిళలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ప్రశ్నా విజ్ఞాన వినోదం



విద్యార్థులకు ప్రశ్నా విజ్ఞాన క్విజ్ నిర్వహణ



పోటీలో పాల్గొన్న విద్యార్థులు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట : గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు ప్రశ్నా విజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎస్.వి.ఎస్.ఆచార్యులు విద్యార్థులకు ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు యోగా శిక్షణ, విశ్రాంత ఉద్యోగి వై.అచ్యుతరావు భగవద్గీత శ్లోకాలు, రామాయణంలో జీవనదులు గురించి తెలియజేస్తున్నారు. అదే విధంగా పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు చదవడం, రాయడం, ప్రసంగించడంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రతి రోజు విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాస రచన పోటీలు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు చెప్పడం సాధన చేయించారు. అనంతరం గ్రంథాలయాలు వాటి ప్రయోజనాలు అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఉపాధ్యాయుడు మస్తాన్ రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.

క్విజ్‌తో విజ్ఞానం మెరుగు

మునగపాక : వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం మునగపాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను అలవాటు చేసుకోవాలన్నారు. క్విజ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా విజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పిల్లా జగదీష్, విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మ పండగ గోడపత్రిక విడుదల



గోడపత్రిక విడుదల చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, కమిటీ సభ్యులు

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ పండగ గోడ పత్రికను ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రతిరూపమైన సతకం పట్టువద్ద ఆదివారం విడుదల చేశారు. ఇక్కడ వచ్చే నెల 6న జరగనున్న పండుగ సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, బి.పైడియ్యనాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం



వెంకునాయుడుపేటలో విరిగిపడిన విద్యుత్ స్తంభం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం



బుచ్చెయ్యపేటలో చల్లబడ్డ వాతావరణం

నర్సీపట్నం: ఈదురుగాలులతో కూడిన వర్షం ఆదివారం మధ్యాహ్నం నర్సీపట్నంలో కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కసారిగా వాతావరణ చల్లబడి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం ప్రారంభమైంది. గంటకుపైగా మోస్తరు కురిసింది. ఈదురుగాలులకు పట్టణంలో వెంకునాయుడుపేటలోని విద్యుత్ స్తంభం విరిగిపడింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ అధికారులు వెనువెంటనే సరఫరాను పునరుద్ధరించారు.

పలు గ్రామాల్లో మోస్తరు వర్షం

రోలుగుంట/బుచ్చెయ్యపేట: గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు ప్రతాపం చూపించి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కొంత సేపటిలోనే ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం పడింది. దీంతో భూముల్లో తడులు ఏర్పడ్డాయి. పదును లేక అపరాలు, నువ్వు పంటలు ఎండలకు వడలిపోతున్నాయి. దీంతో వరుణుడి కోసం రైతులు చూస్తున్న తరుణంలో కురిసిన వర్షంతో జీవం పోసినట్టయింది. రోలుగుంటతో పాటు వెలంకాయలపాలెం, కొండపాలెం, భోగాపురం, కంచుగుమల తదితర గ్రామాల్లో వర్షం పడింది. బుచ్చెయ్యపేటలోని పలు గ్రామాల్లో గాలులకు చెట్టు కొమ్మలు విరిగిపడగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

31న మహాలక్ష్మమ్మ ఆలయ ప్రారంభం

చోడవరం రూరల్: అంభేరుపురంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మ వారి ఆలయాన్ని ఈనెల 31న ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.10 గంటల ఆలయాన్ని ప్రారంభించి, అదే సమయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేస్తామన్నారు. ముందు రోజు మధ్యాహ్నం వినాయక పూజ ఆది వాసములు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం విశేష పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం గుడి వద్ద జాతర నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం నేడు

కోటవురట్ల : అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సోమవారం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొననున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు కొడవటిపూడిలో సచివాలయం, హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం, 9 గంటలకు గవరపేటలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన, 9.30 గంటలకు తంగేడులో బస్ షెల్టర్ శంకుస్థాపన, 10 గంటలకు తంగేడులో విత్తన శుద్ధి ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, 11 గంటలకు పాత గొట్టివాడలో డిజిటల్ లైబ్రరీ శంకుస్థాపన, 12 గంటలకు రామచంద్రపురంలో బస్ షెల్టర్ శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

మునగపాక పరిపాలనాధికారి రవికుమార్‌కు పదోన్నతి

మునగపాక : మునగపాక మండల పరిషత్ పరిపాలనాధికారి రవికుమార్‌కు పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి 93మంది ఈవోపీఆర్డీలు అలాగే 112 మంది పరిపాలనాధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈవోఆర్డీలకు పరిపాలనాధికారులుగానూ అలాగే పరిపాలనాధికారులు గా పనిచేసిన వారికి ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. దీనిలో భాగంగా మునగపాక మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న రవికుమార్‌కు ఎంపీడీవోగా పదోన్నతి కల్పించారు. ఆయనను విజయనగరం జిల్లాకు కేటాయించారు. త్వరలో ఇక్కడ నుంచి రవికుమార్ పదోన్నతిపై వెళ్లనున్నారు.

నేడు పేటలో భారీ బైకు ర్యాలీ

ఎస్.రాయవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో పాయకరావుపేట నియోజకవర్గంలో సోమ వారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ బైకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు తెలిపారు. పాయకరావుపేట పాండు రంగ స్వామి గుడి వద్ద నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బైకు ర్యాలీ ప్రారంభమై అడ్డురోడ్డు వరకు కొనసాగుతుందన్నారు. ఎస్.రాయవరం మండలానికి చెందిన పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మధ్యాహ్నం 2 గంటలకు అడ్డురోడ్డు బిగ్‌బజార్ ప్రాంగణంలోకి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి పాయకరావుపేట వెళ్లి బైకు ర్యాలీలో పాల్గొంటామన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అడ్డురోడ్డు జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో బహిరంగ సమావేశం ఉంటుందని తెలిపారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జంపన



తుమ్మపాల: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జంపన వెంకటసన్యాసిరావు నియమితులైనట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సన్యాసిరావుకు నియామక పత్రాన్ని ఆదివారం అందినట్టు తెలిపారు.

31న వామలింగేశ్వర కల్యాణం

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 31న వార్షిక కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ ఆదివారం తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కోటమ్మతల్లి ఆలయానికి 21 చీరల వితరణ

నాతవరం: అంకంరెడ్డి జమీల్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటమ్మతల్లి ఆలయ కమిటీకి 21 చీరలు వితరణగా అందజేశారు. ఆదివారం జమీల్ కుటుంబ సభ్యులతో పాటు ఆయన అభిమానులు ఆలయ ధర్మకర్త అంకంరెడ్డి కొండయ్యకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరక రేణుక, ఉప సర్పంచ్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా కురిసిన వర్షం

మాడుగుల రూరల్: మండలంలో ఆదివారం ఉదయం నుంచి కాసిన ఎండతోపాటు ఉక్కపోతకు ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి స్వల్పంగా వర్షం కురిసింది. దీనికి తోడు ఈదురు గాలులు వీచాయి. కొంత సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు.

నేడు యలమంచిలిలో భారీ బైక్ ర్యాలీ

ర్యాలీ విజయవంతానికి వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు

యలమంచిలి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు రాజధానిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం యలమంచిలి పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని చేపడుతున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం గౌరవంగా తెత్తుకుని జీవించేలా అందరికీ ఇల్లు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను శ్మశానవాటికలతో పోల్చి పేద ప్రజలను దారుణంగా అవమానించారని అన్నారు. టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉదయం 9 గంటలకు యలమంచిలి పట్టణంలో ఏఎస్ఆర్ కాలనీ నుంచి బోదెపు గోవింద్ పెట్రోల్ బంక్ వరకు పట్టణంలో వైఎస్సార్ విగ్రహం కూడలి వరకు స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యలమంచిలి వైయస్సార్‌సీపీ నాయకులు కోరారు.

ఘనంగా సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ



సత్తెమ్మతల్లి అమ్మవారి దర్శనానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



సత్తెమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ఇందిరమ్మ కాలనీలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కాలనీవాసులంతా డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకొన్నారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వాహనాల అతివేగం నియంత్రించాలి



మునగపాకలో ఆందోళన చేస్తున్న దృశ్యం

మునగపాక : అధికలోడు, అతివేగంతో వచ్చే వాహనాలను నియంత్రించాలని కోరుతూ ఆది వారం మునగపాకలో ఆందోళన నిర్వహించారు. పూడిమడక రోడ్డులో నిత్యం భారీ వాహనాలు పరిమితికి మించి రాకపోకలు సాగించడాన్ని నిరసిస్తూ పలువురు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు శ్రీనివాసరావు, బ్రహ్మాజీ మాట్లాడుతూ నిత్యం పూడిమడక రోడ్డులో రాత్రి, పగలు తేడా లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, దీంతో ప్రస్తుతం ఉన్న రహదారి శిథిలావస్థకు గురైందని అన్నారు. పరిమితికి మించి వేగంతో వాహనాలు నడుపుతున్నారని, దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఆందోళనకు గురవుతున్నారన్నా రు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు దాడి సాంబశివ, శరగడం జగన్, వేగి కుమార్, కర్రి వాసు, ఆదారి గోపి పాల్గొన్నారు.

20 ఏళ్ల తరువాత సందడి చేసిన పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమావేశమైన ఇంటర్ చదువుకున్న మిత్రులు

మునగపాక : మండలంలోని వెంకటాపురం దరి ఇంటర్ చదువుకొని 20 ఏళ్లు పూర్తయిన తరువాత మిత్రులంతా ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విశాఖ డెయిరీ జూనియర్ కళాశాలలో 1999-2001లో ఇంటర్ చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. 20 ఏళ్ల క్రితం ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకున్నారు. కర్రి లక్ష్మినారాయణ, రాపేటి సత్యనారాయణ, చుక్కా గోపీ, ఆదారి రాధాకృష్ణ, దుర్గారావు, నాగేశ్వరరావు, గణేష్, సతీష్, మురళి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

200 రోజుల 'ఉపాధి' కల్పించాలి



వేతనదారులతో మాట్లాడుతున్న నాయుడుబాబు

కె.కోటపాడు: ఉపాధి పనులను ఏడాదికి 200 రోజులపాటు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు కోరారు. ఆదివారం సూర్రెడ్డిపాలెంలో బండారువాని చెరువులో ఉపాధి పనుల వద్ద వేతనదారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులకు ఏడాదికి బడ్జెట్‌లో రెండు లక్షల ఇరవై వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేతనదారులకు వేసవి భత్యం మంజూరు చేయాలని కోరారు. ఉపాధి వేతనదారుల సమస్యలపై సోమవారం అనకాపల్లిలో చలో కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు. సీపీఎం నాయకులు నారాయణమూర్తి, యర్రా దేముడు, రొంగలి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

వీరవల్లి అగ్రహారంలో మోదమ్మకు జలాభిషేకం



మోదమ్మకు జలాభిషేకం చేస్తున్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో మోదకొండమ్మకు ఆదివారం జలాభిషేకం చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు, మంగరాజు సారథ్యంలో మాలధారణ భక్తులు అమ్మవారి పీఠం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 30న అమ్మవారి ఘటాలు, సారె ఊరేగింపు వచ్చే నెల 4న అమ్మవారి ఊరేగింపు ఇరుముడులు ధరించి, పాదయాత్రగా మాడుగుల వెళ్లి అక్కడ మాలధారణ విసర్జన చేస్తామన్నారు.

రేపు గొండుపాలెంలో జాబ్‌మేళా

కె.కోటపాడు: గొండుపాలెంలో ఈ నెల 30న అపోలో ఫార్మసీ యాజమాన్యం సహకారంతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ ఉత్తీర్ణులైన ఉద్యోగార్థులు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 85550 81900కు సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా పట్టాలమ్మ పండగ

మాకవరపాలెం: స్థానిక కిందివీధిలో పట్టాలమ్మతల్లి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం స్థానిక మహిళల ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన ఉత్సాహంగా నిర్వహించారు.